క్లుప్తంగా

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



దామరగిద్ద: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఏపీఓ జయమ్మ, టీఏ రవికుమార్, నరేష్, నహీం డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ సాయిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే బకాయి వేతనాలు విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్ర కమిటీ కార్యాచరణ మేరకు శుక్రవారం నుంచి నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో టీఏలు స్వామి, నరేష్‌కుమార్ సీఓ మహేశ్వరి, ఇందిరా, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిని నివారించండి



ఊట్కూరు: మండలంలో బిజ్వార్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో తాగునీటి ఎద్దడిని నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాలనీలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని దీంతో ఇతర వీధుల్లోకి వెళ్లి తాగునీరు తెచ్చుకోవాల్సి వస్తుందని సుజాత, మొగులమ్మ, రేణమ్మ, మహాదేవమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు గ్రామపంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని లేకపోతే ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

రోడ్డుకు మరమ్మతు



నారాయణపేట రూరల్: మండలంలోని ఊటకుంట తండా నుంచి కోటకొండ గ్రామానికి వెళ్లే రోడ్డుకు మరమ్మతు చేపట్టారు. బండగొండ, భూనెడ్ తదితర గ్రామాలకు వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఈ మట్టి రోడ్డు గుండా ప్రయాణం చేస్తుంటారు. ఉన్నత విద్య కోసం కోటకొండకు విద్యార్థులు కాలినడకన వెళ్తుంటారు. మట్టి రోడ్డు కావడం అలాగే గుంతలమయంగా మారడంతో వాహనదారులు, బాటసారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీంతో సమస్యను మాజీ సర్పంచ్ సీతమ్మ వెంకట్ నాయక్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సొంత డబ్బులతో గురువారం రోడ్డుకు మరమ్మతు చేయించారు.

ఘనంగా కొడిపీర్ల సవారీ



నర్వ: మండలంలోని లంకాల్ గ్రామంలో ఏర్పాటు చేసిన మౌలాలి స్వామి కొడిపీర్ల సవారీని ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల నుంచి వచ్చిన భక్తులు పీర్లకు దట్టీలు, పూలను సమర్పించుకొని ఉత్సవాల్లో పాల్గొన్నారు. పీర్ల చావిడి ఆవరణలో పురుషులు చిన్న, పెద్ద తేడా లేకుండా అలాయ్ బలాయ్ ఆడారు. అనంతరం ఊరేగింపుగా పీర్లను సాగనంపారు.

మద్దూరు కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకటేశ్



మద్దూరు: మద్దూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా తులసి వెంకటేశ్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. హైదరాబాద్‌లోని బీఎస్ఎల్ జూనియర్ కళాశాల ఎకనామిక్స్ ఉపన్యాసకులుగా విధులు నిర్వహిస్తున్న తులసి వెంకటేశ్ పదోన్నతిపై ప్రిన్సిపాల్‌గా నియామకమయ్యారు. కళాశాలలో విద్యార్థులకు మెరుగైన అందేలా తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఎరువుల కొరత.. అన్నదాత కలత



కృష్ణా మండలంలో సాగవుతున్న వరి

- మండలంలో పెరిగిన సాగు విస్తీర్ణం
- యూరియా కోసం రైతుల పడిగాపులు

కృష్ణా: పంటలు బాగా పండి దిగుబడి అధికంగా రావాలంటే ఎరువులు సమృద్ధిగా ఉండాలి. అప్పుడే అన్నదాతకు అంతో ఇంతో లాభాలు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే మండలంలో ఎరువుల కొరతతో కర్షకులు తీవ్ర కలత చెందుతున్నారు. ముందస్తు వానలు కురవడంతో మండలంలో అన్నదాతలు పంటల సాగు ముమ్మరం చేశారు. తీరా ఇప్పుడు ఎరువుల కొరత ఏర్పడడంతో పంటల దిగుబడి తగ్గే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎరువుల కొరకు ఉమ్మడి మండలాల రైతులతో పాటు మక్తల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో కూడ సింగిల్ విండో కార్యాలయాల పడిగాపులు కాస్తున్నారు. సరైన సమయంలో ఎరువులను అందిస్తే పంటల దిగుబడి పెరిగి పెట్టిన పెట్టుబడికి కొంతమేరైన లాభాలు వస్తాయని అన్నదాతలు పేర్కొంటున్నారు.

ఉమ్మడి మండలాల్లో 60వేలకు పైగా ఎకరాల్లో సాగు

ఉమ్మడి కృష్ణా, మాగనూర్ మండలాల్లో మొత్తం 60,700 ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నాయి. ఇందులో ప్రత్తి 31,200 ఎకరాల్లో, వరి 29,500 ఎకరాల్లో సాగు అవుతుంది. కాగా సాగు అవుతున్న పంటలకు అవసరమయ్యే ఎరువులు 1860 మెట్రిక్ టన్నులుగా వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. అయితే మొదటి దఫాలోనే ఇప్పటి వరకు 1300 మెట్రిక్ టన్నుల యూరియాను ఉమ్మడి మండలాల రైతులకు అందించినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మొదటి దఫాలో అవసరం కంటే అదనంగా అందించినా రోజూ వందల మంది రైతులు సింగిల్ విండో కార్యాలయం ఎదుట పడిగాపులు కాయడంపై అధికారులు విస్తుపోతున్నారు. రైతులు అదనంగా తీసుకొని నిల్వ ఉంచుకుంటున్నారా? లేక రైతుల పేరిట అక్రమార్కులు ఎవరైనా తీసుకున్నారా? అనేది తెలియడం లేదు.



మక్తల్‌లోని సింగిల్ విండో కార్యాలయం ఎదుట యూరియా కోసం బారులు తీరిన రైతులు

ప్రైవేట్‌లో కూడా దొరకని పరిస్థితి

ఏటా ప్రైవేట్ డీలర్లు ఏప్రిల్, మే నెలల్లోనే యూరియాను తీసుకొచ్చి అమ్మేవారు. కానీ ఈ సంవత్సరం కేవలం డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను మాత్రమే తెచ్చుకొని నిల్వ చేసుకున్నారు. యూరియా వారి వద్ద కూడా లభించకపోవడంతో ఒక్కసారిగా రైతులు సింగిల్ విండో కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. దాంతోనే ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పలువురు అధికారులు పేర్కొంటున్నారు.

సగం కూడా ఇవ్వడం లేదు



నాకు ఉన్న 5 ఎకరాల పొలంతో పాటు మరో 25 ఎకరాలను కౌలుకు తీసుకున్నాను. ప్రస్తుతం నీరు పుష్కలంగా ఉండడంతో మొత్తం 30 ఎకరాల్లో వరి సాగు చేపట్టాను. దీంతో నాకు 100 బస్తాల యూరియా అవసరం కాగా అందులో కనీసం సగం కూడా లభించడం లేదు. ఏటా 50 బస్తాల దాకా సింగిల్ విండో కార్యాలయం వద్ద తీసుకునేవాణ్ని. ఈ సంవత్సరం ఇప్పటివరకు ఒక్క సంచి కూడా ఇవ్వలేదు. సమయం మీరిన తరువాత పంటలకు ఎరువులు అందించినా ఉపయోగం ఉండదు. పైగా దిగుబడి తగ్గుతుంది.

– కటికల్ నాగప్ప, ముదుమాల్ గ్రామం

గతేడాది కంటే అదనంగా ఇచ్చాం



కృష్ణా, మాగనూర్ మండల రైతులకు అవసరమయ్యే దాని కంటే అదనంగా యూరియాను అందించాం. ఇప్పటి వరకు కృష్ణా మండలంలో 665 మెట్రిక్ టన్నులు, మాగనూర్ మండలంలో 628 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందజేశాం. రైతుల డిమాండ్ మేరకు అందించడానికి సిద్ధంగా ఉన్నాం. రైతులకు అవగాహన లేక ఈ నెలలో వారి అవసరం కంటే అదనంగా తీసుకుంటున్నారు. ముందు ముందు దొరుకుతుందో లేదో అని భయపడి అదనంగా తీసుకోవడంతోనే కొంత ఇబ్బంది నెలకొంది.

– జాన్ సుధాకర్, జిల్లా వ్యవసాయ అధికారి, నారాయణపేట్ జిల్లా

మెరుగైన బోధన అందించాలి



దామరగిద్ద: విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి మెరుగైన విద్యా బోధన అందించాలని ఎంఈఓ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మొగుల్‌మడ్క ఎంపీపీఎస్ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బోధన, టీఎల్ఎం వినియోగం తదితర అంశాలపై ఉపాధ్యాయులతో ఆరా తీశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఏఐ ఎక్స్‌ఐ డిజిటల్ బోధన ద్వారా వెనకబడిన విద్యార్థులు గణితం, తెలుగు వంటి పాఠ్యాంశాల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



మాగనూర్: మండల పరిధిలోని నేరడగందొడ్డి, తంగలేరి, గురువలింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలను నేరడగం కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు రాజేష్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను పలు ప్రశ్నలు సంధించి సమాధానాలు రాబట్టారు. అంతకుముందు పాఠశాల ఆవరణ, తరగతిగదులు, వంటగదిని పరిశీలించారు. కూరగాయలు, పప్పు, కోడిగుడ్లు ఎప్పటికప్పుడు తాజాగా తెచ్చుకొని విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

ధన్వాడ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ అన్నారు. గురువారం ధన్వాడ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ మొదలై రెండు నెలలు కావస్తున్న నేటికీ రైతులకు బోనస్ డబ్బులను వేయలేదని విమర్శించారు. నారాయణపేట– కొడంగల్ ఎత్తిపోతల పథకంలో ధన్వాడ పెద్ద చెరువుకు సాగు నీరు తెచ్చేందుకు డీపీఆర్‌లో ఎలాంటి ప్రణాళిక లేకపోయినా ఎమ్మెల్యే మాత్రం ధన్వాడ పెద్ద చెరువుకు నీరు తీసుకొస్తామని అబద్ధపు మాటలు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే పూర్తి కావొచ్చిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ధన్వాడ పెద్ద చెరువుకు నీరు తీసుకొచ్చేందుకు కాలువలు తీస్తే చాలు రైతులకు నీళ్లు అందే అవకాశం ఉందని ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు శాంతికుమార్, మార్కెట్ యార్డు కమిటీ మాజీ డైరెక్టర్ శివరెడ్డి, సత్యనారాయణగౌడ్, శ్రీశైలం, నాసర్, ఇర్ఫాన్, వెంకటేష్ పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

నారాయణపేట: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా, ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా మైనార్టీ కార్పొరేషన్ శాఖ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన 200 మంది ముస్లిం మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముస్లిం మహిళలు ఆర్థిక ప్రగతి సాధించడానికి ప్రభుత్వం కుట్టుమిషన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థకాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు అందజేస్తున్న ఒబేదుల్లా, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

మహిళల సంక్షేమానికి పెద్దపీట

తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. గురువారం అభినందన్‌గార్డెన్‌లో జరిగిన ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళల ఆర్థిక ప్రగతికి ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు ఇలా అనేక పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. పెట్రోల్ బంకులు మహిళలు నిర్వహించడం దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో అమలుచేస్తున్నట్లు తెలిపారు. గోదాముల నిర్మాణం తదితర కార్యక్రమాల ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించండి

కొత్తపల్లి: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేకంగా అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను, నూతన ఎమ్మార్సీలకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను, సీఆర్‌పీలను నియమించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి యోగితారాణా, డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు నిర్ణీత పాఠశాలలో వినతిపత్రం అందజేశారు. ఆమె కొత్తపల్లి, గుండుమాల్ మండలంలోని పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాల పర్యవేక్షణ కోసం రావడంతో వీరు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.



యోగితారాణాకు పూలమొక్కతో పాటు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రతి ఎకరాకు సాగునీరందించాలి

మద్దూరు: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా మద్దూరు మండలంలోని ప్రతి ఎకరానికి సాగునీరు అందించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో మద్దూరులో మండల మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ.. ఈ ఎత్తిపోతల ద్వారా కొడంగల్ నియోజకవర్గంలో 53,745 ఎకారలకు మాత్రమే నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇందులో మద్దూరు మండలానికి సాగునీరు అందే పరిస్థితి లేదన్నారు. సరైన ఉపాధి అవకాశాలు లేక మండల ప్రజలు పట్టణాలకు వలస వెళ్తున్నారని, సాగునీరు అందితే వలసలను నివారించవచ్చన్నారు. అనంతరం అఖిలభారత ఐక్యరైతు సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లేష్, కార్యదర్శిగా కొండప్ప, ఉపాధ్యక్షులుగా రాములు, ఆశప్ప, వెంకటప్ప, సహాయ కార్యదర్శిగా సాయిలు, కేశవులును ఎన్నుకున్నారు.



మహాసభలో పాల్గొన్న నాయకులు

వెలగని వీధిదీపాలు.. చీకట్లో కాలనీలు



మండల కేంద్రంలోని పలు వీధుల్లో అంధకారం నెలకొంది. కొంతకాలంగా వీధిదీపాలు వెలగకపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా మాగనూర్ శివకాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రివేళల్లో రాకపోకలు సాగించేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఇటీవల పలు ప్రాంతాలలో దొంగతనలు కూడా జరుగుతున్నాయి. వర్షాకాలం కావడంతో విషపురుగులు సైతం ఇళ్లలోకి వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్త వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

– మాగనూర్

ఎంపీ డీకే అరుణతో నాయకుల భేటీ

నారాయణపేట రూరల్: తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్‌గా బాధ్యతలు తీసుకున్న పాలమూరు ఎంపీ డీకే అరుణను గురువారం బీజేపీ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. బీజేపీలో మహిళలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావు నామాజీ, రతంగపాండు రెడ్డి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాసులు, భాస్కర్, తిరుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.



డీకే అరుణను సన్మానిస్తున్న నాయకులు

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



వ్యాపారులు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

కోస్గి రూరల్: మున్సిపల్ పరిధిలోని చిరు వ్యాపారులకు లబ్ధి చేకూర్చి వారిని ప్రోత్సహించడమే తమ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం పట్టణంలో మహిళ సంఘాలతో పాటు చిరు వ్యాపారులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు , తినుబండారాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ వ్యాపారులను ప్రోత్సాహించేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 100వ రోజుల కార్యాచరణలో భాగంగా ప్లాస్టిక్ కవర్లు అమ్ముతున్న పలు దుకాణాలపై దాడులు చేసి జరిమానా విధించారు. ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ అనిల్‌కుమార్ , హెల్త్ అసిస్టెంట్ మోహిన్‌బాషా, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది , కార్మికులు ఉన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కోస్గి రూరల్: మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని మహబూబ్‌నగర్ రోడ్డు నుంచి డంపింగ్ యార్డు వరకు రూ.10 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, ఇద్రిస్ , బాల్‌రాజ్ , బాలేష్ , శ్రీనివాస్ , బందెప్ప, హన్మయ్య , ఓంప్రకాష్ , మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'నాయీ బ్రాహ్మణులకు అన్యాయం చేస్తే ఊరుకోం'

మరికల్: నాయీ బ్రాహ్మణులకు అన్యాయం చేస్తే ఊరుకోమని నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు రఘు, వేణు, బాల్‌రాజ్, బీషప్పలు గురువారం సంయుక్త ప్రకటనలో అన్నారు. ఇతర కులాల వారు కూడా సెలూన్ షాపులు పెట్టుకోవచ్చని ప్రభుత్వం చెప్పడాన్ని వారు ఖండించారు. కరోనా అనంతరం నాయి బ్రాహ్మణుల జీవితం అగమ్యగోచరంగా మారిందన్నారు. జిల్లాలో 2 వేలకు పైగా సెలూన్ షాపులు ఉన్నాయని, ఇతర కులాల వారు కూడా సెలూన్ షాపులు నిర్వహించుకోవాలని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వ పరంగా తమకు చేయూత నందించి ఆదుకోవాలని కోరారు.

వీరశైవ మండల కమిటీ ఎన్నిక

కోస్గి: వీరశైవ సమాజం మండల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. స్థానిక బసవ మఠంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కమిటీ గౌరవ అధ్యక్షుడిగా కేణం శేఖర్, అధ్యక్షుడిగా ఆవిటి నాగరాజు, ఉపాధ్యక్షులుగా విజయ్ కుమార్, శంకర్, ప్రధాన కార్యదర్శిగా మజ్జిగ సోమ శేఖర్, కోశాధికారిగా గొంగళ్ల నటరాజ్‌తోపాటు పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

రాజేందర్ రెడ్డి సేవలు మరువలేనివి

నారాయణపేట రూరల్: ఎస్పీ బాలు అభిమాన సంఘం వ్యవస్థాపకుడు, గాయకుడు రాజేందర్ రెడ్డి కళా రంగానికి అందించిన సేవలు మరువలేనివని ఎస్పీ బాలు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన వర్ధంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కళాకారులకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమమంలో రాధ, ప్రభాకర్ రెడ్డి, అనంత్ రెడ్డి, సంగ నర్సింహులు, వసంత్, పాండు, సునీల్, లింగారెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు

కోస్గి రూరల్: దొంగతనాల నిర్మూలనలో భాగంగా కోస్గి బస్టాండ్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో పలువురి ప్రయాణికుల ఫింగర్ ప్రింట్‌లను తీసుకున్నారు. ప్రయాణికుల మాటున కొంత మంది రద్దీగా ఉన్న సమయంలో దొంగతనాలకు పాల్పడుతున్నారని, బస్సు ఎక్కే , దిగే సమయంలో ప్రయాణికులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే 100కు ఫోన్ చేయాలన్నారు.

ఉపాధి కల్పనకు చర్యలు

కోస్గి రూరల్: మండలానికి ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారికి ఉపాధి కల్పించడమే లక్ష్యమని వాసన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మనోజ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ముశ్రీఫా గ్రామంలో మహిళల ఆధ్వర్యంలో వలస కుటుంబాలు, నిరుపేద మహిళలను గుర్తించి వారికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణ్ , వినోద్, సందప్ప , ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కొండచిలువ కలకలం



నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామంలో గురువారం ఉదయం యానగుంది మల్లప్ప ఇంటి సమీపంలో చిన్న కొండ చిలువ ప్రత్యక్షమైంది. దీంతో భయాందోళనకు గురైన కుటుంబీకులు ఇరుగుపొరుగు వారికి ఫోన్లు చేయగా వారు వచ్చేలోపు కొండచిలువ పొదల్లోకి జారుకుంది. పక్కనే కొండ ప్రాంతం ఉండడంతో అక్కడి నుంచి వచ్చి ఉండొచ్చని స్థానికులు తెలిపారు. అటవీ శాఖ అధికారులు గుర్తించి దూరంగా తరలించాలని కోరుతున్నారు.

ఉచితంగా టీబీ రోగ నిర్ధారణ పరీక్షలు




నారాయణపేట రూరల్: టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం టీబీ రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆదిత్య డయాగ్నోస్టిక్ సెంటర్‌లో పలువురికి ఉచితంగా ఎక్స్‌రేలు తీసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మల్లికార్జున్, కార్యదర్శి డాక్టర్ ప్రసాద్, కోశాధికారి డాక్టర్ గీత, ఆదిత్య గౌడ్, పద్మకళ, నీలవర్ణ, ప్రీతి, మౌనిక పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



దామరగిద్ద: పేదల సొంతింటి కలను నేరవేర్చేందుకే ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చిందని కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ చైర్మన్ చిన్నయ్య అన్నారు. గురువారం మండలంలోని అయ్యావారిపల్లి గ్రామంలో పలువురికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను నిబంధనల మేరకు నిర్మించుకోవాలని, సకాలంలో విడతల వారిగా బిల్లులు అందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు బాలవర్ధన్‌రెడ్డి, రాము, నర్సప్పలు పాల్గొన్నారు.

న్యాయమైన పరిహారం చెల్లించండి



నారాయణపేట: మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలని భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మచ్చేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టి అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. భూ నిర్వాసితులను పూర్తిస్థాయిలో ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా బేసిక్ ధరను నిర్ణయించి 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం అధికారి అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.